


**విద్యార్థుల నమోదు పెంచాలి**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 07 జూన్ , 2026 | పేజీలు : 06

### కేంద్రం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ పెంపుతో

# సామాన్య ప్రజలపై భారం

ధరలను పెంచి ప్రజల నడ్డి విరిచిన బిజెపి ప్రభుత్వం

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే

పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా జూన్ 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ** : దేశంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్,డీజిల్‌తో పాటు వంట గ్యాస్ ధరలను విడతల వారీగా పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందని నల్లగొండ సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్రంగా ధ్వజమెత్తారు.పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10వ తేదీన సిపిఐ ఆద్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. శనివారం నల్లగొండ జిల్లా సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు.ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు.ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలపై భారాలు మోపుతూ కార్పోరేట్ శక్తులకు వేల కోట్ల రూపాయల రాయితీలు కట్టబెడుతున్నారని ఆరోపించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పేదలు,రైతులు,కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడంలో కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని,తెలంగాణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం సన్న బియ్యం లాంటి ఒకరు రెండు పథకాలు మినహా మిగిలినవి పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఎమ్మెల్సీ సత్యం ఎత్తిచూపారు. రైతు రుణమాఫీ ఇంకా పూర్తికాలేదని, రైతు భరోసా పథకం అరకొరగా అమలవుతోందని తెలిపారు.ఆసరా పించన్ల పెంపు,కొత్త పించన్ల మంజూరు,ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.భువనగిరి సహా పలు ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తికాక రైతులు ఐకేపీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని,మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు.జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడం లేదని,సొరంగ మార్గం,డిండి ఎత్తిపోతల,ఉదయసముద్రం ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నిర్ణీత కాలం వ్యవధిని పెట్టుకుని ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని,బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి కృష్ణాపురం వరకు కాల్వల ద్వారా చెరువులను నింపాలని కోరారు. రైతు డిస్కమ్‌ను సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందని, రైతులపై అదనపు భారం మోపే ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.జూన్ 10న చేపట్టే కలెక్టరేట్ ధర్నాలో ప్రజలు, రైతులు,కార్మికులు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై గళం వినిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు,సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్,కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు,తూము బుచ్చిరెడ్డి,పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/చివ్వేంల** : ప్రజా సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం మండలంలోని గుంజలూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. గ్రామసభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదలన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు, అంతర్గత రహదారుల నిర్మాణం, త్రాగునీరు ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఇఓ శిరీష, డిపిఓ యాదగిరి, డిఐఇఓ సులోచన రాణి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ సంతోష్, సర్పంచ్ సైదులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా నీట్ యూజీ పరీక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నీట్ యూజీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, లైటింగ్, బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక తహసీల్దార్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నామని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో కూడిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని, జనరేటర్లు, జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేష్,డీఎం రాంపత్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కట్టుకున్నోడిని కాదని... ప్రియుడిపై మోజు..!

చివరికి ప్రియుడి చేతిలోనే ప్రియురాలు హతం

మహిళ హత్య కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసులు...




## పట్టణంలో భారీ వాహనాలపై ఆంక్షలు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, పాఠశాలల ప్రారంభం దృష్ట్యా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారీ వాహనాలు,లారీలు,ట్రాక్టర్ల రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు.ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి వాహనదారుడు కచ్చితంగా పాటించాలని సూచించారు.పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు భారీ వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలకు పట్టణ పరిధిలో అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.వాహనాలు నడిపేటప్పుడు లేన్ డిసిప్లిన్ పాటిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 24వ ర్యాంక్ సాధించిన గండు గీతాంజలి



**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన గండు వెంకట్ గౌడ్ కుమార్తె గండు గీతాంజలి పోస్ట్ గ్రాడ్యుయేషన్ ( కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించి విశేష ప్రతిభ కనబరిచింది. ఈ విజయంలో కుటుంబ సభ్యులు ,గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి కనబరిచిన గండు గీతాంజలి క్రమశిక్షణతో పాటు నిరంతర శ్రమ ద్వార ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. పరీక్ష ఫతితాలు వెలుబడిన వెంటనే అభినందనలు వెల్లువెత్తాయి.

# కబ్జాలకు గురైన బందెల దొడ్లను స్వాధీనం చేసుకోవాలి

**ప్రజాపక్షం/చండూరు:** తప్పిపోయిన పశువులు, మేకలు , గొర్రెలను సురక్షింతంగా ఉంచడానికి ఏర్పాటు చేసిన బందెర దొడ్లను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బందెర దొడ్లకోసం కేటాయించిన భూములు కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లడంపై అన్ని గ్రామ పంచాయితీలలో విచారణ చేసి అట్టి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గ్రామ పంచాయితీలకు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రైల్వే పోలీసులకు గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గుర్తుతెలియని వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు చిట్యాలశ్రీరాంపురం రైల్వే స్టేషన్ల మధ్య జారిపడి రైలు పట్టాల పక్కన మృతిచెందినట్లు నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ బొడిగె రామకృష్ణ శనివారం తెలిపారు.ఈఘటన వారం రోజుల క్రితం జరిగిందన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో కుళ్లిపోయి ఉందన్నారు.మృతదేహంపై గోధుమ రంగు షర్టు,నలుపు రంగు డ్రాయర్ ఉన్నాయని, మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు.ఈఘటనపై నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.మృతుని గురించి ఏమైనా సమాచారం తెలిస్తే ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫోన్ నంబర్లు 8712658595కు సమాచారం అందించాలని కోరారు.

# రైతులపై ఆర్థికభారం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై ఆర్థిక భారం మోపుతూ వ్యవసాయానికి దూరం చేస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఎం.డేవిడ్‌కుమార్ విమర్శించారు.పార్టీ నల్లగొండ జిల్లా ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవన్‌లో జిల్లా కార్యదర్శి సాగర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాలా వెంకటేశ్వర్లు,కార్యదర్శి అంబటి చిరంజీవి,పజ్జూరి ఉపేంద్ర,బొమ్మిడి నగేశ్,వేముల శంకర్,గజ్జి రవి,సత్తయ్య,వెంకటేశం, పవన్,అనిల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.




# కలల్వాడ అగ్నిబాధిత కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పేద కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, బాధితులు ధైర్యం కోల్పోవద్దని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని కలల్వాడలో జరిగిన ప్రమాదంలో మరణించిన చంద్రమ్మ, లక్ష్మణ్, ప్రణీత భౌతిక కాయాలకు ఆయన పూలమాలలు వేసి అశ్రునివాళులర్పించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన అనంతరం పుట్టెడు శోకంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం మిర్యాలగూడ పట్టణాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ పరిస్థితిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా అందాల్సిన గృహ నిర్మాణ నిధులు, ప్రభుత్వ సహాయాన్ని త్వరగా మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. మృతుల అంత్యక్రియల ఖర్చుల కోసం రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణమే బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# కన్నవారిని రోడ్డున పడేస్తే చట్టం ఊరుకోదు

## అధికారుల సమక్షంలో వృద్ధ దంపతుల గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సొంత ఆస్తిని ఆక్రమించి వృద్ధ తల్లిదండ్రులను గాలికి వదిలేసే నిర్దయాత్మక ధోరణిని సహించేది లేదని మిర్యాలగూడ పోలీస్, మున్సిపల్ యంత్రాంగం తేల్చిచెప్పింది. హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఐదేళ్లుగా నరకం అనుభవించిన ఇంజం చంద్రకళ, రమణారెడ్డి (70) వృద్ధ దంపతులకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ద్వారా సంపూర్ణ న్యాయం చేకూరింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి ఉన్నా, పక్షవాతం, మోకాళ్ల శస్త్రచికిత్స వంటి అనారోగ్యాల వల్ల మిర్యాలగూడలోనే నివాసముండాలని భావించారు. కానీ కుమారుడు వారిని ఇంట్లోకి రానివ్వకుండా దౌర్జన్యం చేయడంతో వారు సీనియర్ సిటిజెన్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ద్వారా చట్టాన్ని ఆశ్రయించారు.వృద్ధుల హక్కులను గౌరవిస్తూ జిల్లా కలెక్టర్ గత నెల 15న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, స్థానిక ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి వివిధ శాఖలను సమన్వయం చేస్తూ గత నెల 23న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, సీఐ నాగభూషణం, తహసిల్దార్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ సిబ్బంది సంయుక్తంగా తరలివెళ్లి సదరు ఇంటిని ఆక్రమణల నుండి విముక్తి చేశారు. వృద్ధ దంపతులను శనివారం వారి సొంత ఇంట్లో సగర్వంగా కూర్చోబెట్టారు. ఈ మానవీయ చైతన్య కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ ఆర్ఐ రాజు, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు, నాగిరెడ్డి, నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమని నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం రెండో విడతగా పలు డివిజన్‌లలో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈకార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.వార్డు సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం ఫోర్‌వే వేస్ట్ సెగ్రిగేషన్, అంటే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, హానికరమైన గృహ వ్యర్థాలుగా వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శా)య నిర్వహణ సాధ్యమవుతుందని వివరించారు.

# గ్రామసభ నిర్వహణపై ప్రజల నిలదీత



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని పిన్నాయిపాలెం గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ గ్రామసభలో అధికారుల తీరుపై గ్రామ ప్రజలు నిలదీశారు. గ్రామసభ ఉందని ప్రజాప్రతినిధులకు, గ్రామ ప్రజలకు తెలియకుండా ఉదయమే సమాచారం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని ప్రకటించి ఉదయం 9.30 గంటలకు ప్రారంభించటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పబ్బు వెంకన్న గౌడ్ మాట్లాడుతూ గ్రామసభ ఉన్నట్లు తనకు కూడా సమాచారం ఇవ్వలేదని దీంతో 8 మంది వార్డు సభ్యుల్లో ఒక్కరు కూడా హాజరు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని దుయ్యబట్టారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ సైతం గ్రామ పంచాయితీ అధికారుల వ్యవహారంపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



# కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు, మహిళా ఓటర్లను చైతన్యపరుస్తూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మహిళా కాంగ్రెస్ ప్రతినిధుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గోపగాని మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా పక్షపాత ప్రభుత్వం అధికారంలో ఉందనే విషయాన్ని క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే భారీ సభ మహిళా చైతన్యానికి వేదిక కాబోతోందన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, నాయకురాళ్లు సువర్ణ, జానకి, స్వరాజ్యలక్ష్మీ , లలిత, భాగ్యలక్ష్మీ , పద్మ, శ్రావణి, పద్మ, సదాలక్ష్మీ , స్వప్న, నిర్మల, రుద్రమ్మ, నవనీత పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారంగా మార్చిన కాలేజీలపై చర్యలు ఏవి..?

## బిసిల ఉన్నత చదువులపై సర్కార్ నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో విద్య అనేది ప్రతి పేదవాడి హక్కుగా కాకుండా కేవలం పెద్దవాళ్ల చదువుగా మారిపోవడంపై బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మిర్యాలగూడ బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద వర్గాల అభ్యున్నతికి తోడ్పడాల్సిన విద్య నేడు లక్షల రూపాయల వ్యాపారంగా మారిపోయిందని ధ్వజమెత్తారు. ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి ఉన్నత చదువుల కోసం ప్రైవేట్ కాలేజీలు విచ్చలవిడిగా డొనేషన్లు, లక్షల రూపాయల వార్షిక ఫీజులు వసూలు చేస్తూ ప్రజలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టేస్తున్నాయని మండిపడ్డారు. లేనిపక్షంలో బీసీ విద్యార్థి, యువజన లోకాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి రవీందర్ గౌడ్, మిర్యాలగూడ బీసీ జేఏసీ కన్వీనర్ దాసరాజు జయరాజు, బీసీ జేఏసీ కో కన్వీనర్ మురళి యాదవ్ పాల్గొన్నారు.

# పైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని తక్షణమే అరికట్టాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న అధిక ఫీజుల దందాకు ప్రభుత్వం తక్షణమే అడ్డుకట్ట వేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ఆరంభాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్డగోలుగా అధిక ఫీజులు దండుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయని, వీటిని అదుపు చేయడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని మండిపడ్డారు. పాఠశాలల్లో అడ్మిషన్ల పేరుతో భారీ మొత్తాలు లాగడమే కాకుండా పుస్తకాలు, స్కూల్ యూనిఫాంల అమ్మకాల పేరిట ఎలాంటి నియంత్రణ లేకుండా అదనపు డబ్బులు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. లేనిపక్షంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన శ్రేణులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



## బాలభవన్ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బాలభవన్ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. శనివారం బాలభవన్ సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా పిఎంశ్రీ జడ్‌పి హెచ్‌ఎస్ (బాలుర) పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. చిన్నారులకు డ్రాయింగ్, క్రాఫ్ట్, డ్యాన్స్, కోలాటం తదితర అంశాలపై వేసవి కాలం సెలవులు సద్వినియోగం అయ్యేటట్లు శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షఫీఉల్లా, వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, జిహెచ్‌ఎం గోలి పద్మ, బాల్‌భవన్ అభివృద్ధి కమిటి సభ్యులు హమీద్‌ఖాన్, గ్రీన్‌క్లబ్ ఫౌండర్ ముప్పారపు నరేందర్, బండి రాధాకృష్ణ, దాసరి యల్లయ్య, ఉమారాణి పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రజాపాలన జాతర

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ ప్రత్యేక గ్రామసభలు శనివారం జాతరగా జరిగాయి. స్థానిక సమస్యల పరిష్కారం, పారదర్శక పరిపాలన, గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో సాగిన ఈ సభలకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. జల్మల్‌కుంటతండలో సర్పంచ్ భూక్య జమనాయక్, గూడెపుకుంట తండలో సర్పంచ్ గుగులోతు లచ్చిరాం, ధర్మాపురం గ్రామంలో సర్పంచ్ దొంగరి దివ్య లింగస్వామి, దుబ్బతండలో సర్పంచ్ జేత్యనాయక్, గాజులమల్కాపురం గ్రామంలో సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి, దోసపహాడ్ గ్రామంలో సర్పంచ్ వలపట్ల సైదమ్మ లింగయ్య, దూపహాడ్ గ్రామంలో సర్పంచ్ నన్నెపంగు కమలమ్మల అధ్యక్షతన ఈ గ్రామ సభలు జరిగాయి. ప్రజల నుండి వినతులు, ఆర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయి తీసుకెళ్లడంలో ఏపిఓ రవి, ఏపిఎం అంజయ్యలతోపాటు పంచాయితీ కార్యదర్శులు సతీష్, రజిని, లావణ్య, జానీవర్మ, భరత్ పాల్గొన్నారు.



## నల్లగొండలో ఎన్టీఆర్ విగ్రహానికి మంటలు..కలకలం రేపిన ఘటన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎన్జీ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ చౌరస్తాలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.విగ్రహం నుంచి పొగలు,మంటలు ఎగసిపడుతున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.విగ్రహం కొంత మేర దెబ్బతినగా,అనంతరం మున్సిపల్ సిబ్బంది విగ్రహాన్ని శుభ్రపరిచి తిరిగి రంగులు వేసి పునరుద్ధరణ పనులు చేపట్టారు.విగ్రహానికి మంటలు అంటుకోవడం వెనుక సాంకేతిక కారణాలున్నాయా, షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా,లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పంటించారా అనే అంశాలపై విచారణ సాగుతోంది.

**విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి**

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన గొప్పవ్యక్తి విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నల్లగొండ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి,జిల్లా నాయకులు ఎల్‌వి యాదవ్ డిమాండ్ చేశారు.ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ శనివారం టిడిపి నాయకులు జిల్లా ఎస్‌పికి వినతిపత్రం సమర్పించారు.అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకంతో శుద్ధి చేసి పూలమాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్ కుమార్, గుండు వెంకటేశ్వర్లు, సిద్ధిక్, కాంచనపల్లి క్రాంతికుమార్, వనమా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వైరస్ సోకిన కుక్కలకు వైద్య చికిత్స



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేట పట్టణంలో వైరస్ సోకిన 194 కుక్కలను గుర్తించి వైద్య చికిత్సను అందించారు. ఇటీవల కుక్కలకు చర్మవ్యాధులు సోకడంతో ప్రజలు భయబ్రాంతులకు గురికాగా బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ షెల్టర్ డైరెక్టర్ సి.ఎఫ్.ఓ ఎన్.ఎస్.కె. కుమారి, సంస్థ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల కుక్కలకు చికిత్సను అందించేందుకు ముందుకు వచ్చినట్లు ఆ సంస్థ సూర్యాపేట వాలెంటీర్, కాంగ్రెస్ నాయకులు గొట్టెముక్కల నరేందర్ నాయుడు తెలిపారు. రూ.1.80లక్షలతో కుక్కలకు ఇంజంక్షన్‌లు, మందులు ఇచ్చినట్లు చెప్పారు. పట్టణంలోని 48వార్డుల్లో దశలవారీగా వైద్య చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. కుక్కలను పట్టుకొని వాటి రక్తనమూనాలను ఇప్పటికే సేకరించామని చెప్పారు. సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది, కమీషనర్ హన్మంతరెడ్డిలు బ్లూక్రాస్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాన్ని అభినందించారు. జంతు ప్రేమికురాలైన అక్కినేని అమల లక్షలాది రూపాయలు వెచ్చించి నోరులేని మూగజీవులకు చికిత్స చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కౌన్సిలర్లు వేణుగోపాల్, కోడి శిరీష శివ, కాంగ్రెస్ నాయకులు సైదులు పాల్గొన్నారు.

## ప్రతీ ఉద్యోగి అంకిత భావంతో సేవలందించాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతి ఉద్యోగి దార్శనిక ప్రమాణాలతో పయనిస్తూ అంకిత భావంతో పని చేయాలని ఎంజీయూఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు.శనివారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో బోధ నేతర సిబ్బందికి నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికృషి,నిబద్ధత, సమయనిష్టా,నియమనుసరణ ద్వారా కార్య నిర్వాహక సమర్థత సాధ్యమవుతుందని, ఇవి విశ్వవిద్యాలయం ప్రతిష్ఠని నిర్ధారించే మూలస్తంభాలని స్పష్టం చేశారు.పారదర్శకత బాధ్యతాయుత తత్త్వం, పారదర్శక విధానాలు,బహుభాగస్వామ్య ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలను అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ రేజిస్ట్రార్ అబ్దుల్ రషీద్ షేక్ డాక్టర్ ఖుద్దుస్ ఇరువురు మాట్లాడుతూ జాతీయ స్థాయి సంస్థలతో సంబంధాల ద్వారా శిక్షణ, నిధి, మార్గదర్శక సహకారాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.పరస్పర అనుభవాల మార్పిడి,కేస్ స్టడీస్ ఆధారిత శిక్షణా కార్యక్రమాలు, ప్రాక్టికల్ పథకాలు అమలు చేయవలెనని సూచించారు.ఫ్రంట్ ఫైల్ వ్యవహారాల సమర్థత, ఆఫీసు ఇన్నోవేషన్,డిజిటల్ రికార్డింగ్, పబ్లిక్ ఫేసింగ్ కమ్యూనికేషన్ పాఠ్యాలు అవసరమన్నారు. ఆచార్య కొప్పుల అంజిరెడ్డి రిజిస్ట్రార్ ఎంజియూ, ఆచార్య ఆకుల రవి,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అవార్డు పారిశుధ్య కార్మికుల కృషి వల్లనే



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు రావడానికి పారిశుధ్య కార్మికుల కృషి వల్లనే సాధ్యమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. అవార్డు రావడం పట్ల ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు మున్సిపల్ కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అవార్డు వెనుక కార్మికుల కృషి దాగి ఉందన్నారు. తాను పదవి చేపట్టిన కొద్ది రోజులకే అత్యుత్తమమైన పర్యావరణ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుధ్య పనులు ప్రతినిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని, సూర్యాపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, నాయకులు రాచకొండ శ్రీనివాస్, బిక్కుమళ్ల కృష్ణ, జూలకంటి నాగరాజు, సుమన్ వెంకన్న, మిట్టపల్లి రమేష్, బోనగిరి కృష్ణ, డోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి రాజశేఖర్, సోమ ప్రవీణ్, రాచర్ల సత్యం, బెలిదె శ్రీనాధ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## చిమిర్యాల ప్రభుత్వ పాఠశాలలో ఘోర అగ్నిప్రమాదం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని చిమిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఒక్కసారిగా భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పాఠశాల గదిలో మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ప్రమాదం జరిగిన సమయంలో పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, అందరూ ఊపిరి పీల్చుకున్నారని స్థానికులు తెలిపారు. పాఠశాల భవనం నుండి దట్టమైన పొగలు, మంటలు రావడం గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాఠశాల గదుల్లో నిల్వ ఉంచిన నూతన పాఠ్యపుస్తకాలు, విద్యార్థుల కీలక రికార్డులు, బెంచీలు, కుర్చీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నీచర్ సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతై బూడిదయ్యాయి.

**సహాయక చర్యల్లో గ్రామస్తులు...**

అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలియగానే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకొని సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. మంటలు పక్కనే ఉన్న ఇతర తరగతి గదులకు, కార్యాలయానికి వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో పాఠశాల ఆస్తి నష్టం భారీగా జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రధాన కారణమని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నప్పటికి, పూర్తిస్థాయి సాంకేతిక విచారణ అనంతరం కారణాలు వెలువడుతాయని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న విద్యాశాఖ అధికారులు ప్రమాద తీవ్రతను పరిశీలించి, నష్టానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు సైతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సెలవులు కావడంతో పెను ప్రమాదం తప్పిందని, లేదంటే ఊహించని నష్టం జరిగేదని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## నిధులు విడుదల చేయకపోతే మూల్యం తప్పదు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బిసి హక్కుల సాధన సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బిసిల అభివృద్ధి, సంక్షేమం కొరకు బడ్జెట్‌లో రూ.2500కోట్లు ప్రత్యేక నిధి కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసి సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ మాదిరి బిసి సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి నిధుల వినియోగానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలన్నారు. పేద విద్యార్థులకు విద్యకు దూరం కాకుండా ఉండేందుకు పెండింగ్ ఫీజు ఇవ్వాలని అన్నారు. బిసిలకు సంబంధించి సముచిత ప్రాధాన్యత దక్కడం లేదని బిసిల ఆర్థిక, విద్య, రాజకీయం సాధికారతకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బిసి యువతకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవల వెంకన్న, ఈట దాసు, ఎం. రవి, కె. పరుశురాం, ఎల్. వెంకన్న, నాగరాజు, సైదులు, లక్ష్మయ్య, బ్రహ్మం, నర్సయ్య పాల్గొన్నారు.

## తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా అస్లాం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శిగా అస్లాంను ఎంపిక చేసినట్లు సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణా రెడ్డి ప్రకటించారు. నకిరేకల్‌లో టీయూడబ్ల్యూజే నల్లగొండ జిల్లామహా సభలో నల్గొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడు దశాబ్దాలకు పైగా జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఎండి.ఫక్రుద్దీన్ (అస్లాం)ను టీయూడబ్ల్యూజే నల్గొండ జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎన్నికయ్యారని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గానికి, వివిధ హోదాలలో ఉన్న యూనియన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ అస్లాం జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల నియోజకవర్గ పరిధిలోని పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని నీర్నెముల గ్రామంలో గ్రామ కంఠం భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సర్వే చేసి ఆ భూములను కాపాడాలని నీర్నెముల గ్రామ ప్రజలు అన్నారు. శుక్రవారం నీర్నెముల ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక గ్రామ సభ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో వున్న గ్రామ కంఠం,చెరువు శిఖం, కుంటల భూములను కొందరు అక్రమంగా ఆక్రమించి పంటలు పండించుకుంటున్నాను వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను సర్వే చేసి కాపాడాలని గ్రామ ప్రజలు కోరారు.

## హైదరాబాద్ బయలుదేరిన రైతులు

**ప్రజాపక్షం/హాలియా:** హైదరాబాదులోని కోహెడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ మార్కెట్ ప్రారంభానికి అనుముల మండలంలోని రైతులను వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో తీసుకెళ్లారు.శనివారం మండలం నుండి ఏర్పాటుచేసిన బస్సుల్లో రైతులను కోహెడ రైతు మార్కెట్ వద్దకు తరలించారు. హైదరాబాద్ వెళుతున్న రైతుల బస్సులను హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాలియా ఏ డి ఏ సరిత, ఏవో వెంకన్న తదితరులు ఉన్నారు.




# కోహెడ రైతు మహోత్సవానికి అన్నదాతలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కోహెడ గ్రామంలో శనివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు మహోత్సవం కార్యక్రమానికి మిర్యాలగూడ నియోజకవర్గం నుండి అన్నదాతలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం జరిగిన ఈ మహోత్సవానికి నియోజకవర్గ పరిధిలోని ప్రతి వ్యవసాయ క్లస్టర్ నుంచి రైతులను ప్రత్యేక బస్సుల ద్వారా వెళ్లారు. మిర్యాలగూడ పట్టణంలోని స్థానిక ఎన్ఎస్పి క్యాంపు మైదానంలో సిద్ధంగా ఉన్న ప్రత్యేక బస్సులకు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పచ్చ జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. మొత్తం 8 ప్రత్యేక బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు చిలుకూరు బాలకృష్ణతో పాటు మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి ఎం.ఋష్యేంద్రమణి, వ్యవసాయ విస్తరణ అధికారులు పార్వతి, అఫ్రిన్, రమేష్, నరేష్, గోపి పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిపై గ్రామసభలద్వారా అవగాహన



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలో 99 రోజుల ప్రణాళిక లో భాగంగా బాబుల్ నాయక్ తండ, ముల్కలపల్లి, దయ్యం బండతండా, వేలుపల్లి, వెంకటాపూర్, వీరారెడ్డిపల్లి, ఇందిరానగర్, తిరుమలపూర్, గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో మండల ఎంపీడీఓ గీతారెడ్డి హాజరై మాట్లాడుతూ, వర్షాకాల సన్నద్ధత,సురక్షిత త్రాగునీటి నిర్వహణ,ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ వన సంరక్షణ, మొక్కల పెంపకం వన మహోత్సవం,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్, వరద నిర్వహణ భద్రత కార్యక్రమాలపై గ్రామ సభల్లో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ అనంతరెడ్డి, ఏఈపిఆర్ చక్రధర్, ఇరిగేషన్ ఏఈ మనోహర్, ఏఈ హౌసింగ్ నరేష్ నాయక్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్, సర్పంచులు మాలోతు మంగ్తి, గుండా సిద్ధులు, వాంకుడోత్ సుధాకర్, కర్రె మాధవి కరుణాకర్, తునికి లక్ష్మి , రావుల లక్ష్మి , దొనికేన రేణుక వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, జిపిఓలు, ఏఎన్ఎం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల రాజకీయ ప్రమేయంపై తక్షణ విచారణ జరిపాలి





**ప్రజాపక్షం/తుర్కపల్లి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పత్రికల్లో ప్రచురితమైన శుభాకాంక్షల పోస్టర్లో తుర్కపల్లి మండల తహశీల్దార్, జిల్లా తహశీల్దార్ల సంఘం అధ్యక్షుల ఫోటో, హోదా రాజకీయ నాయకులు,పార్టీ ప్రతినిధుల చిత్రాలతో కలిసి ప్రచురించబడటం తీవ్ర అభ్యంతరకరమైన విషయమని,ప్రభుత్వ అధికారుల రాజకీయ ప్రమేయంపై తక్షణ విచారణ జరిపి,అధికార దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. లప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా ఉండి ప్రజలందరికీ సమానంగా సేవలు అందించాల్సిన బాధ్యత కలిగలిగి ఉండాలి కానీ,ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారులు రాజకీయ నాయకుల జన్మదిన పోస్టర్లలో, పార్టీ నాయకులతో కలిసి కనిపించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఇది ప్రభుత్వ యంత్రాంగం నిష్పాక్షికతపై ప్రజల్లో అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతులు, నిరుద్యోగ యువత, పేదలు మరియు సామాన్య ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తారు. అక్కడ అధికారులు రాజకీయాలకు అతీతంగా న్యాయం చేస్తారనే నమ్మకం ప్రజలకు ఉండాలి. కానీ అధికార హోదాలను ఉపయోగిస్తూ రాజకీయ కార్యక్రమాలతో అనుబంధం ఉన్నట్లు కనిపించడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని, ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

# నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండ లం దోతిగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. నిన్నటి నుండి 8వ తేదీ వరకు జరిగే శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో జరిగే వార్షికోత్సవాలలో భాగంగా దేవాలయం శాశ్వత ధర్మకర్త దేవరపల్లి బుచ్చిరెడ్డి దీపిక దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణంలో భక్తులు ఊర బోనాలు సమర్పించారు. భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి కళాకారులచే నిర్వహించిన ఒగ్గు కథ కాలక్షేపం అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి దేవాలయం చైర్మన్ పగిళ్ళ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ బాలం మల్లేష్, సర్పంచ్ యాట జంగయ్య ముదిరాజ్, ఉప సర్పంచ్ బద్దం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు ఆలయ ప్రధాన కార్యదర్శి ప్రసాదం విష్ణు, సహాయ కార్యదర్శి ముద్దం సత్తయ్య, కోశాధికారి ముద్దం సత్యం యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చొప్పరి పాండు, మహేందర్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్య డ్రైవింగ్‌తో వృద్ధుడిని బలికొన్న ద్విచక్ర వాహనదారుడు




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్ తో ద్విచక్ర వాహనదారుడు వృద్ధుడిని ఢీ కొట్టి మృత్యువు ఒడిలోకి పంపిన ఘటన అలీనగర్ పెద్దగూడెంల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం అలీనగర్ గ్రామవాసి శ్యామల రామస్వామి(80) మేకల కాపరి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మూత్ర విసర్జన కు ఇంటి నుండి బయటకి వెళ్ళి రోడ్డు ప్రక్కన మూత్ర విసర్జన చేసి తిరిగి ఇంట్లోకి వెళ్ళుటకు రోడ్డు దాటుతుండగా జూలూరు వైపు నుండి అలీనగర్ మీదుగా పెద్దగూడెం వైపు ఒక వ్యక్తి పల్సర్ బైక్ ను అతివేగంతో, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా మృతున్ని బలంగా ఢీకొట్టడంతో అతనికి రెండు కాళ్లు ఎడమ చేయి విరిగి చెవిలో నుండి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్యామల బాల నర్సింహా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని మృతిని కుటుంభ సభ్యులకు అప్పగించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడి రెండు కాళ్లు మొత్తం పూర్తిగా విరిగిపోయి వేలాడుతూ విగత జీవిగా పడి ఉండటం చూస్తే బైక్ ఎంత వేగంతో ఢీ కొట్టిందో ప్రమాద తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

## పశువుల ఆరోగ్య సంరక్షణపై అప్రమత్తత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో పశుపాలకులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డా. పృథ్వీరాజ్ సూచించారు. శనివారం పోచంపల్లి మండల ప్రాథమిక పశువైద్యశాల అధికారిగా బదిలీపై పెద్దకొండూరు నుండి వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.వర్షాకాలం రాకముందే పశువుల షెడ్లను శుభ్రపరచి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలనీ హెమరేజిక్ సెప్టిసీమియా బ్లాక్ క్వార్టర్ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ వంటి వ్యాధుల నివారణకు అవసరమైన టీకాలు వేయించాలనీ తెలిపారు.పశువులకు పరిశుభ్రమైన తాగునీరు మరియు సమతుల్య ఆహారం అందించాలని గోమారులు, పేలు వంటి బాహ్య పరాన్నజీవుల నివారణకు తగిన మందులు వాడాలనీ చెప్పారు. కాగా పోచంపల్లిలో పశు వైద్యశాల అధికారిగా విధులు నిర్వహించిన డా శ్రీనివాస్ బదిలీపై కీసరకు వెళ్లారు.

## బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు అన్నారు. ఆయన మోటకొండూరు మండల కేంద్రంలో ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సహృదయ అనాద ఆశ్రమంలో బ్రేడ్‌ల పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజక వర్గం అభివృద్ధి లో దూసుక పోతున్న బీర్ల అయిలయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూమండ్ల శ్రీనివాస్, మోటకొండూర్ సర్పంచ్ భూ మండ్ల జేయమ్మ, నాయకులు వంగపల్లి మహేందర్, పెరబోయిన కార్తీక్, అంజనేయులు, బాల్ద సిద్దులు, భూమండ్ల వెంకటేష్,క్యాసగల్ల చందు, బాస్కరుని పద్మ, శోబ, లలిత పాల్గొన్నారు.

## జానయ్య అరెస్టు అప్రజాస్వామికం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అరెస్ట్ అప్రజాస్వామీకం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు బూడిద శ్రీనాథ్ గౌడ్ అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రజల పక్షాన పోరాడితే ఇలాంటి అరెస్టులు సమంజసం కాదని ఆయన అన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని ఆయన విమర్శించారు.



## అక్కెనపల్లి విద్యార్థినులను అభినందించిన కవిత

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఎస్ఎస్‌సిలో మండల ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థినులు పూజారి ప్రసన్న(544 మార్కులు),చిరబోయిన నర్మద (467 మార్కులు)లను టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ టీజీ లింగం గౌడ్ విజ్ఞప్తి మేరకు విద్యార్థినులు పై చదువుల కోసం బీసీ గురుకుల సీఓఈ కళాశాలలో అడ్మిషన్ ఇప్పించాలని కవితను కోరగా,ఆమె తక్షణమే స్పందించి సంబంధిత ఉన్నత అధికారులతో మాట్లాడి అడ్మిషన్లు ఏర్పాటు చేశారు.అనంతరం కవితకు కృతజ్ఞతలు తెలిపిన నేస్తం బృందం సభ్యులు పవన్ కుమార్ యాదవ్,రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/మునుగోడు: తెలంగాణ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం పుట్టినరోజు సందర్భంగా సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు సురిగి చలపతి,మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య,మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాష్,దుబ్బ వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎండీ జానీ మియా,ఏఐటీయూసీ మండల అధ్యక్షులు బెల్లం శివయ్య, కురుమర్తి ముత్తయ్య,సామాజిక నాయకులు మల్ల యాదయ్య,నెల్లికంటి రాఘవేంద్ర,చొల్లేటి వెంకట కృష్ణ చారి, సైదులు, రామలింగయ్య పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించాలి

ప్రజాపక్షం/చింతలపాలెం : మండలంలో వివిజి రామ్‌జీ కింద అర్హులైన ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని నిరుద్యోగుల జెఏసి మండల కన్వీనర్ ధారావత్ నరసింహ డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం 125 రోజులు పని కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం రెండు వారాల పాటు మాత్రమే పనులు అందిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం, పేద కుటుంబాలకు ఆర్థిక బరోసా కల్పించడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం లక్ష్యాలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో పనుల కల్పన జరుగుతోందన్నారు. నిర్దేశిత 125 రోజుల ఉపాధి అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి 125 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పథకం అమలులో ఉన్న లోపాలను సరిదిద్ది, కూలీలకు నిరంతర ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## రైతులకు రుణమేళా



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు మిర్యాలగూడ, నిడమనూర్, మల్లెపల్లి బ్రాంచీల వారి సహకారంతో శనివారం స్థానికంగా వ్యవసాయ రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైస్ మిల్లర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు జనరల్ మేనేజర్ ఏడి శ్రీనివాస్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 114 సంవత్సరాల నుంచి దేశవ్యాప్తంగా వినియోగదారులకు విశిష్ట సేవలను అందిస్తూ మన్ననలను పొందుతుందన్నారు. రైతులకు సంబంధించిన వ్యాపారవేత్తలకు, అగ్రికల్చర్ ప్రొడ్యూసర్లకు మిల్లర్లకు, కోల్డ్ స్టోరేజ్. ఫుడ్ ప్రాసెసింగ్ వారికి తక్కువ వడ్డీ రేట్లు కల్పిస్తూ రుణాలు అందిస్తున్నామన్నారు. అదేవిధంగా ఎస్‌జిహెచ్ సభ్యులకు చిన్నతరహా వ్యాపారులు, మహిళా సంఘాలు, వాణిజ్య వ్యాపార వర్గాలకు వరంగల్ రీజన్ వ్యాప్తంగా రూ. 110 కోట్లు రుణాలను అందించిన ఘనత తమ తమదేనన్నారు. వరంగల్ రీజన్ మేనేజర్ రాజకుమార్, ఆయా బ్రాంచీల మేనేజర్లు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ...వెండి,నగదు అపహరణ



ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మండలంలో ఎడవెల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పాశం గోపాల్ రెడ్డి తల్లి వసంతమ్మ నివాసం ఉంటున్న గృహంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, వసంతమ్మ కుమారుడు గోపాల్ రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉంది. ఈవిషయం గమనించిన గుర్తుతెలియని దుండగులు రాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 17 తులాల వెండి,రూ.16 వేల నగదు,ఒక సెల్ ఫోన్‌ను దొంగిలించి పరారయ్యారు.ఉదయం ఇంటి పక్కన ఉన్నవారు తాళం పగలగొట్టి ఉండటం గమనించి లోనికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.హైవేకు దగ్గరగా,రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామం కావడంతో పలుమార్లు దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నేరాలు అరికట్టేందుకు గ్రామపంచాయతీ పాలక మండలి వెంటనే సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని,రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా పర్యావరణ దినోత్సవం



ప్రజాపక్షం/చింతలపాలెం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని శ్రీనాగలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొర్బల గోవిందరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకల శ్రీనివాసరెడ్డి హాజరై ఆలయ పరిసరాల్లో మొక్కలను నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి పెద్దఎత్తున మొక్కలు నాటడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి రంగారెడ్డి, అంబటి లచ్చిరెడ్డి, మల్లెల నాగిరెడ్డి, అడ్వకేట్ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నెమ్మోజు రామాచారి, ఆలయ అర్చకులు బొర్రా అనంతచార్యులు, ఉపాధి హామీ మేట్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభ

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభ నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. గ్రామ ప్రగతికి ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, మండల విద్యాధికారి నకిరేకంటి రవి, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, జిహెచ్‌ఎం చీకూరి అంజయ్య, పంచాయితీ కార్యదర్శి లావణ్య, ఏఈఓ, జిపిఓ, ఇతర అధికారులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/బొమ్మలరామారం : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, సర్పంచుల పోరం మండల అధ్యక్షులు దాసరి సూర్యప్రకాశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ, పలు గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## బిసి ఉద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావించండి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను మండలిలో ప్రస్తావించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేష్, బీసీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొన్నె శంకర్ గౌడ్‌లు అన్నారు. శనివారం నల్గొండలో నెల్లికంటి సత్యం జన్మదినాన్ని పురస్కరించుకుని శాలువ కప్పి శుభకాంక్షలు తెలియజేశారు. సామాజిక దృక్పథంతో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సంఘాలను ప్రోత్సహించాలని కోరారు. జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాపని వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సమీర్ కుమార్, దసరా కాశీయాదవ్, శీలం చంద్రయ్య, అంబటి వీరనారాయణ, మండల అధ్యక్షులు శ్రీనివాస్, కృష్ణ, వెంకటనరసయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి అహర్నిశలు కృషి

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తాజా మాజీ ఎంపిటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాశం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నార్కట్‌పల్లిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటూ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతోందని తెలిపారు. రైతు భరోసా,ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పెన్షన్లు,మహాలక్ష్మి,గృహజ్యోతి,రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.ప్రభుత్వ విప్ వేముల వీరేశం విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలతో నీటి పొదుపు అవగాహన



ప్రజాపక్షం/తిప్పర్తి: జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు సర్వారం,మామిడిగూడెం గ్రామాల్లో ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ నీటి నిల్వలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడాలి,చెట్లు పెంచి పర్యావరణాన్ని ఎలా సంరక్షించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. భూమిని బతకనిద్దాం అనే నినాదంతో గ్రామ పంచాయతీలలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడి భావితరాలకు భవిష్యత్తు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య,ఏపీవో కడెం రామ్మోహన్, ఏటీఎం శంకరయ్య,ఈసీ జులుకర్,తిప్పర్తి సర్పంచ్ బద్దం రజిత సుధీర్,సర్వారం సర్పంచ్ తగుళ్ల శ్రీను,మామిడిగూడెం సర్పంచ్ మారుపాక నాగమణి, కళాకారులు,గ్రామపంచాయతీ కార్యదర్శి షఫీ,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/మర్రిగూడ: కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండలం లోని అన్ని గ్రామాల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరంను ఆదివారం మర్రిగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నారు.50 సంవత్సరాల వయసు పైబడిన వారు విధిగా ఆధార్ కార్డుతో పాటు, ఫోన్ నంబర్, గతంలో మీరు వాడుతున్న మందులను కూడా వెంట తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకురానున్నారు.




## లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా యాద కిరణ్ కుమార్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాద కిరణ్ కుమార్ నియమితులయ్యారు. శనివారం పట్టణంలోని బాలాజీ గ్రాండ్‌లో ఆయన ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ మార్గదర్శకాలను అమలుపరుస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తానన్నారు. సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నడిపిస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్ మధన్‌మోహన్ రెపాల, కినోట్ స్పీకర్ తీగల మోహన్‌రావ్, విడిజి1 కోడె సతీష్ కుమార్, విడిజి2 గుడిపుడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి చీకూరి కృష్ణ, కోశాధికారి మిర్యాల వెంకటేశ్వర్లు, సభ్యులు కొండ సంతోష్, త్రివేణిహరి పాల్గొన్నారు.


## 50 వసంతాలు పూర్తి చేసుకున్న రమేష్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్



**ప్రజాపక్షం/రామన్నపేట** : ఒక వ్యాపారం సుదీర్ఘకాలం కొనసాగుతుంది అంటే ఆ వ్యాపార సంస్థ పైన, ఆ వ్యాపార నిర్వాహకులపైన ప్రజలకు ఉన్న అపారమైన నమ్మకం. మన్నికైనా, నాణ్యత కలిగిన వస్తువుల విక్రయం, మర్యాద, వినియోగదారుల పట్ల వినమ్రత, గౌరవించడం తదితర అంశాలు వ్యాపారం నిరంతరం కొనసాగడానికి దీర్ఘకాలంగా నిలబడి ఉండడానికి కారణమని చెప్పక తప్పదు. రామన్నపేటలో 50 ఏళ్లకు పైగా సాగుతున్న వ్యాపార సంస్థలు ఒకటి రెండు మాత్రమే ఉన్నాయి. అందులో ఒకటి రామన్నపేటలో 50 వసంతాలుగా కొనసాగుతున్న రమేష్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్. 1976 సంవత్సరంలో మండల కేంద్రంలోని పాతచాపల మార్కెట్ వద్ద స్థాపించారు. నాటినుండి నిరంతరాయంగా కొనసాగుతూ ఈ ప్రాంత ప్రజల మనలను పొందుతుంది. నాణ్యమైన, నాణ్యత కలిగిన మందులను అందించడానికి రాజీపడకుండా ఫార్మసిస్ట్ పర్యవేక్షణలో ప్రామాణికంగా అర్థ శతాబ్ద కాలం నుండి కొనసాగుతూనే ఉంది.

## పండ్లు పంపిణీ....

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తెలంగాణ సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం జన్మదినంను పురస్కరించుకొని శనివారం భువనగిరి మండలం రాయగిరీ గ్రామంలో గల సహృదయ వృద్ధ ఆశ్రమంలో పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కలేపల్లి మహేందర్, మర్రిగూడెం సర్పంచ్ స్వప్న జగన్ పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని వాసవి గార్డెన్ నందు శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణి చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు ఉపేందర్, బిక్షం, ఐలయ్య, నాగిరెడ్డి, నారాయణ స్వామి, కుమార్, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ ఎంపిపి వేణుగోపాల్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథ గుప్తను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మండలంలోని దోరకుంట సమీపంలో కారు, ఆటో ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుండి బలంగా ఢీకొట్టిన స్కార్పియో కారు ప్రమాద సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులు ప్రయాణిస్తుండగా రాంకోటేశ్వర్‌రావు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట మండలం ముత్యాల గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి గ్రామంలో పెళ్లి సంబంధం మాట్లాడేందుకు వెళ్ళి వారు తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# రైతులకు పచ్చి రొట్టె ఎరువుల పంపిణీ



**ప్రజాపక్షం/తిప్పర్తి:** రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో పచ్చి రొట్టె ఎరువులను అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్‌కోరారు.తిప్పర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు పచ్చి రొట్టె ఎరువులను నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డితో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్టె వాడకం వల్ల భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. నేలలో సేంద్రీయ పదార్థం,నత్రజని స్థాయి సహజంగా పెరుగుతుందని, భూమి మెత్తబడి మట్టిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని వివరించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సన్నీ రాజ్, ఏఈఓలు సంతోషి,రజిత, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం సుధీర్,మాజీ సర్పంచ్ జాకటి మోష,పల్లె ఎల్లయ్య, ఆదిమూలం ప్రశాంత్,నలపరాజు శ్రీనివాస్ గుర్రం శ్రీనివాస్ రెడ్డి,గోలి జగన్ రెడ్డి,తండు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమకేసులు నమోదు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, బాధితులు వెల్లడించిన ఆరోపణల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ చేసిన ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేందర్‌పైన అక్రమంగా నేరారోపణలు చేసి కేసులు నమోదు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ శనివారం మర్రిగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన దేవరకొండ డిఎస్‌పికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు చేసిన ఆరోపణల మేరకు పేరు ప్రస్తావించకుండా వార్త ప్రచురించినందుకు విలేకరిపై కేసు నమోదు చేయడం భావ్యం కాదని అన్నారు. అదేవిధంగా బాధితులు స్వయంగా విడుదల చేసిన వీడియోలు,ఇప్పటికే ప్రచురితమైన వార్తలను సామాజిక మాధ్యమాల్లో ఫార్వర్డ్ చేసినందుకు ఏఐవైఎఫ్ నాయకులపై కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.





## పంట మార్పిడితో అధిక దిగుబడి సాధించవచ్చు

**ప్రజాపక్షం/బీబీనగర్** : రైతులు పంట మార్పిడితో అధిక దిగుబడుని సాధించవచ్చు అని గ్రామ సర్పంచ్ బింగి అలివేలుమంగా శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రగతి ప్రణాళిక ప్రజాపాలల్లో భాగంగా గ్రామంలో పారిశుద్ధ త్రాగునీరు ఆరోగ్యం వర్షాబావ పరిస్థితిలో అంటువ్యాధులు పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో వచ్చే వర్షాకాల సీజన్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశమునందున ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత తోనే అంటువ్యాధి నివారించవచ్చని ఆమె కోరారు. ఈ సమావేశంలో తాసిల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ, మండల వివిధ శాఖల అధికారులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జతిన్ మరణం అత్యంత బాధాకరం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవరకొండ నియోజకవర్గ మున్నురుకాపు సంఘం కన్వీనర్ కోట్ల జగదీష్ పటేల్ కుమారుడు కోట్ల జతిన్ కుమార్ (12) ఆకస్మిక మరణం అత్యంత బాధాకరం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. జతిన్‌కుమార్ ఇంట్లో శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా గుండెపోటుతో మరణించాడు. చదువుకునే వయస్సులో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు, కొండమల్లేపల్లి ప్రజానికం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఉదయం ఎంఎల్‌ఏ బాలునాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జతిన్‌కుమార్ పార్థివదేహానికి పూలమాలలు వేసి కోట్ల జగదీష్‌పటేల్‌ను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. అశ్రునయనాల మధ్య జతిన్‌కుమార్ అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి ప్రధాత దూదిపాల శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ సిరాజ్‌ఖాన్, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో మహిళ డిక్లరేషన్ అమలు, మహిళల సమస్యలు, సంక్షేమ పథకాలపై సర్వే పట్టణంలోని చైతన్యనగర్‌లో శనివారంసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా సహాయ కార్యదర్శి మిర్యాలగూడ టూ టౌన్ కార్యదర్శి పాదూరు గోవర్ధన పాల్గొని మాట్లాడుతూ సమభావన సంఘాల ద్వారా మహిళలను లక్షాధికారులుగా చేస్తామని చెప్పి మహిళా సంఘాలకు తగిన నిధులు అందించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా డిక్లరేషన్ ప్రకటించి పథకాల అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని బియ్యం మాత్రమే కాకుండా పప్పులు, చక్కెర, చింతపండు, కంది పప్పు, వంట నూనెలు, సబ్బులు 14 రకాల నిత్యావసర వస్తువులు రేషన్ షాపు ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పళ్ళ నిర్మల, మేక బుజ్జమ్మ, కడియం సరోజ పాల్గొన్నారు.